# నైజం

పనిచేసే పత్రికలో నా డెస్కుకు కొంత ప్రాముఖ్యం ఉంది. అయినంతమాత్రాన రెండు మూడు రోజుల సెలవు ఇవ్వడానికి మా మేనేజ్‌మెంట్ అంత హైరానా పడాల్సిన పనిలేదు.



కె.యస్.రమణ

రైలు కదులుతోంది. హడావిడిగా పరిగెత్తి అందుకోగలిగాను. లోనికి చొరబడి నా బెర్త్‌నెంబర్ చూసుకుంటూ వెళుతున్నాను. వాసన. రైల్లో ప్రత్యేకంగా వచ్చే వాసన ఊపిరితిత్తుల్లోంచి పేగుల్లోకి వెళ్ళి చుట్టుకుంటున్నట్లు అనిపించింది. రైలు ఎక్కినప్పుడల్లా ఇలాంటి బాధ తప్పదు. వీడ్కోలు మాటలూ, కేకలూ, చాయ్ కాఫీలూ, తోపుడుబళ్ళ చప్పుడూ వీటన్నింటినీ మింగేస్తూ ఓ కూత విన్పించింది. భారంగా కొండచిలువలా కదిలిన రైలు అంతకంతకూ వేగం పుంజుకుంది. కిటికీలవద్ద, తలుపులవద్ద గుమికూడిన జనం తమ తమ సీట్లలోకి సర్దుకుంటున్నారు.

నాది కిటికీపక్క సీటు. అందులో ఓ అమ్మాయి కూచుని పక్కనేవున్న మరో ప్రౌఢతో కబుర్లు చెబుతోంది.

'దయచేసి ఇటు జరుగుతారా కాస్త' అన్నాను మర్యాద ఉట్టిపడే స్వరంతో. నిజానికి నాకు చాలా చికాగ్గావుంది. ఉదయంనుంచీ పరుగుపరుగు పనులతో సెలవుకోసం జరిగిన చిన్నసైజు యుద్ధంతో కొంత అలసటగా ఉంది. నేను

ఆ అమ్మాయి నావంక చురుగ్గా చూసి పక్కకి జరగడం, నా సంచీ సర్దుకుని సీటులో వెనక్కి చేరగిలబడటం అన్నీ యాంత్రికంగా జరిగిపోయాయి. కిటికీలోంచి సూర్యాస్తమయాన్ని చూస్తున్న నన్ను మళ్ళీ ఆఫీసు ఆలోచనలు చుట్టుముట్టాయి. మేనేజింగ్ డైరెక్టర్ మొహం గుర్తొచ్చింది. అతని అరవయాస-ఇంగ్లీష్‌లో విన్న మాటలు గుర్తొచ్చాయి. నా ఆలోచనలకి నామీదే విసుగొచ్చింది. అవన్నీ మర్చిపోవాలి. ఇంకో మూడురోజులదాకా అని దృఢంగా నాకు నేనే అనుకున్నాను. వెంటనే ఆ ప్రయత్నంలో పక్కన ఉన్న అమ్మాయివంక చూపు తిప్పాను.

'ఇక హిందీ తెలుగు సినిమాల సంగతి చెప్ప

కండి. వాటిలో ఏది దేనికి మూలమో పట్టించుకునే సమయం లేదు. అవసరమూ లేదు. ఒకటి కథ, ఒకటే సూత్రం. వేరే వేరే మనుషులతో వేరేవేరే సెట్టింగ్‌లతో తీసి పడేస్తుంటారు. ఆ పాత్రలన్నీ ఒకే మూసలో అఘోరిస్తుంటాయ్ పైగా' అంటోంది ఆ అమ్మాయి పక్కావిడతో.

'కబుర్లు ప్రారంభించారు ఇక అంతం ఉండదు పడుకునేదాకా' అనుకున్నాను.

'ఇంటిల్లిపాదీ చూడాల్సిన చిత్రం అంటారు మళ్ళీ ఎంత అసభ్యమైన డైలాగులో, నృత్యాలో చెప్పలేం. కొంతలో కొంత అరవ సినిమాలు నయం. నేను చూసినవరకు కొత్తయాక్టర్లు, స్త్రీ సమస్యల్నీ, కుటుంబ గాథల్నీ చిత్రించేవి బాగానే అనిపించింది' అంది ప్రౌఢ ఆ అమ్మాయితో.

అటు చివర కూచున్న ఓ ముసలాయన ఆ ప్రౌఢ తండ్రో, మామో కాబోలు. కళ్ళజోడు సర్దుకుని మళ్ళీ పత్రికలో తలదూర్చేశాడు.

నేను ఆ అమ్మాయివంక చూశాను పరిశీలనగా. కోలమొహం, కొంత చిక్కినట్లున్న ఒళ్ళు, పల్చటి చెంపలమీద అల్లరిగా ఎగిరిపడుతున్న వంకీల జుట్టు, కదిలినప్పుడల్లా తమాషాగా ఊగే చెవిరింగులు, చిన్నపిల్లల ఆశ్చర్యమైన కళ్ళు, సన్నటి ఎర్రటి కిందిపెదిమ తడి మెరుపు, కింద చిన్న నల్లటి మచ్చ ఆమె కళ్ళకొసలనించి ఓరగా నన్ను గమనించటం గుర్తించి కిటికీపక్క పరుగెత్తుతున్న మైదానాలవంక, నల్లటి దుప్పటి కప్పుకుంటున్న కొండల వంక చూస్తుండిపోయాను.

'ఆ అరవ సినిమాలూ అట్లాగే అఘోరించాయిలెండి. అందులో స్త్రీపాత్రలు, ఇతివృత్తాలూ ఆ మగబుద్ధినే, పితృస్వామ్య దుష్టలక్షణాలనే ప్రతిబింబిస్తున్నాయి. బాలచందర్ నుంచీ విస్సు వరకు స్త్రీ పురుషుడికి ఎన్నిరకాలుగా ఉపయోగపడగలదో, పురుషుడి లాలసత్వాన్ని ఎన్నిరకాలుగా సర్దుకుపోవాలో చెప్పేవే. పురుషునిమీద మానసికంగా, భౌతికంగా ఆధారపడ్డం, మగవాడి అహాన్ని సంతృప్తి పర్చటమే జీవిత పరమార్థంగా భావించటం ఆ కథల్లోనూ కన్పిస్తాయి. 'అణివేర్' సినిమా చూసేవుంటారనుకుంటాను. అందులో హీరోయిన్ ఐఏఎస్ ఉద్యోగాన్ని వదిలేసి హీరోదగ్గర చేరి పిడకల తట్టతో అతని అహాన్ని సంతృప్తిపర్చాలని ప్రయత్నిస్తుంది. కాని ఎక్కువ సినిమాలు మగబుద్ధితో మగ ప్రయోజనాలను అంతో ఇంతో నెరవేర్చేవే? కాకుంటే ఈ విషయాలు శ్రద్ధగా గమనిస్తే కాని అర్థంకావు. ఆ కోణం నుంచి చూడకపోతే మనమూ అందరిలా భ్రమలోనే ఉంటాం' ఆ అమ్మాయి మాటల్లో వేగమూ, స్పష్టతా, స్వరం సన్నాకర్షించాయి.


చాలా ఆసక్తిగా అనిపించి ఆమెవైపు చూసి అప్రయత్నంగా చిరునవ్వు నవ్వాను. ఒక్కక్షణం ఆమె కళ్ళలో మెరుపు మొహమంతా పర్చుకుని మాయమైంది. మళ్ళీ వాళ్ళ సంభాషణ పుస్తకాల మీదికీ, పత్రికలమీదకి మళ్ళింది. వాళ్ళిద్దరూ పరిచయస్తుల్లా ఉన్నారు. మెల్లిగా మాట్లాడుకుంటున్నారు. పరిసరాలనేం గమనించకుండా.

వాళ్ళ సంభాషణలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నా ఉన్నట్లుండి మధు గుర్తురావడంతో నా ఆలోచనలన్నీ అటు మళ్ళాయి. వాడు ఓ పెద్ద పేరున్న రచయిత కిందకే లెక్క. టెన్నిస్‌లో బాగా, రచనారంగంలో తనను ఫిఫ్త్‌రాంక్‌గా చెబుతూ ఉంటాడు మధు. ఈ మధ్యే ఓ వారపత్రికలో సీరియల్‌గా వచ్చి పుస్తకంగా విడుదలైన 'ఊపదలో అనాథ' మధు రాసిందే. సమాజంలో స్త్రీ పతనానికి కారణమైన దుష్టశక్తులను ఎండగట్టడమే అందులో ధ్యేయంగా రచయిత శ్రమించాడని పబ్లిషర్ ఇచ్చిన కితాబుని మాత్రం చదివాను నవలవెనుక అట్టమీద. పబ్లిషర్‌లు టార్గెట్ గ్రూప్‌లో ఎప్పుడూ ఆడవాళ్ళే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. వాళ్ళను దృష్టిలో ఉంచుకునే చివరికి ముఖచిత్రం కూడా తయారయ్యేటట్లు చూస్తారు. వ్యాపార రచనారంగంలో పోటీకి నిలవగలగడం సామాన్యంకాదు. పాఠకుల అభిరుచికనుగుణంగా కథను వండగల నైపుణ్యం ఉంటేనే ఆ రచయితకు పేరు వస్తుంది. సేల్స్ గ్రాఫ్ పడిపోకుండా ఎడిటర్లూ, రాంకింగ్ కోల్పోకుండా రచయితలూ పాఠకుల కోరికమేరకు భరతనాట్యం చేస్తారు, బ్రేక్‌డాన్స్ చేస్తారు. సినీ పరిశ్రమకు దీటుగా రచనా పరిశ్రమ వర్థిల్లుతోందంటే ఇంతమంది కృషి కారణం మరి.

మధు పెళ్ళయింది ఇటీవలే. పెళ్ళికి వెళ్ళలేకపోయాను. అనుకున్నవన్నీ సాధించటంలో మధు అందెవేసిన చెయ్యి అనుకుంటాను. దాన్ని లౌక్యం అని కొందరంటారు. వాడి ప్రపంచం చాలా పెద్దది. రకరకాల వ్యాపకాలున్నాయి. బ్యాంక్‌లో ఉద్యోగం. స్థితిపరుడే. డబ్బు తెచ్చిన ఆరోగ్యం, ఆకర్షణా, ఆత్మాతిశయం రూపం పొందితే అది మధు. పైగా మధు రచయిత కూడాను. అతనివెంట ఎప్పుడూ ఒకరో ఇద్దరో తిరుగుతుండేవారు.

మధు స్నేహితురాళ్ళలో చెప్పుకోదగినవాళ్ళు ముగ్గురుండేవారు. కామినీ, రతి, రమ్య. రతి, రమ్యలయితే మధుతో సాయంత్రాలు గడిపేందుకు పోటీ పడుతున్నట్లుండేవారు. వీళ్ళలో ఎవరినో ఒకరిని మధు పెళ్ళి చేసుకుంటాడు అనుకున్న నా అంచనాని తలకిందులు చేస్తూ పెళ్ళికార్డులో హరిత అనే పేరు కన్పించడంతో కొంత ఆశ్చర్యపోయినమాట నిజమే.

కామిని సైకాలజీ స్టూడెంట్. మా బ్యాచే. ప్రస్తుతం రీసెర్చిలో చేరింది. తెలివైన అమ్మాయి. కుబుసం విడిచిన నాగుపాములా మసలే ఆమె జోలికి ఎవరూ అంతగా వెళ్ళే ధైర్యం చేసేవాళ్ళు కాదు. మధుని సాహిత్య చర్చల్లో కవ్వించటం, విసిగించటం, ఓడించటం ఆమెకు సరదా. రతీ, రమ్యలు మధు అభిమానులు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఎం.ఏ మొదటి సంవత్సరం సైకాలజీలో చేరారు. మధుద్వారా కామినీకి స్నేహితులయ్యారు. వీళ్ళ జట్టు నేనూ, మధూ తరుచూ కలుస్తుండేవాళ్ళం. చివ్వాపాటీ నుంచి సాహిత్యం, మనస్తత్వశాస్త్రం వరకు రకరకాల విషయాలమీద చర్చ జరుగుతుండేది. నిరుద్యోగ పర్వంనుంచి తప్పుకుని భాగ్యనగరంలో పాత్రికేయత్వం స్వీకరించాక నా రాకపో



కలు అంతంతమాత్రమే అయ్యాయి ఈ ఊరి కి. రతీ, రమ్యల్లో రతి అంటే మధుకి ఆకర్షణ ఉన్నట్లనిపించేది. ఆ అమ్మాయి మాటల్లోనూ మధుపట్ల ఆరాధన తొంగిచూస్తుండేది. అయి నా హరిత ఎలాంటి అమ్మాయి అయివుంటుం ది? బహుశ కామినీ వ్యక్తిత్వం, వర్చస్సు రతిలో ని అవయవాల పొందికా ఆకర్షణా కలగలిసిన రూపం ఏమో! హరితది అన్పించింది.

ఆలోచనల్లో గమనించలేదు. కొందరు పడ కలు సర్దుకుంటున్నారు. కొందరు భోజనాలు, టిఫిన్లు కానిస్తున్నారు. నేను నా వెంట తెచ్చుకు న్న బ్రెడ్డు ముక్కల్ని తిని నీళ్ళుతాగి పడుకునేం దుకు ప్రయత్నాలు ప్రారంభించాను. నాది కిందిబెర్తు. ఇంతలో రైలు ఒకచోట ఆగినట్లుం ది. లోనికి ఓ నడివయస్కుడూ, యువతీ చిన్న పాపాయితో వచ్చారు. టీసీ వెనకనే వచ్చి ఏదో గొణిగి వెళ్ళిపోయాడు. ఆ నడివయస్కుడు రావటంతోనే దాడి ప్రారంభించాడు. ముందు నన్ను అడిగాడు.

'మీది కింది బెర్తు అనుకుంటాను. ఆడవా ళ్ళకోసం అది వొదిలి దయచేసి మీరు పైబెర్తు తీసుకుంటారా?''

'సరే' అని గొణిగి పైన పక్క పర్చుకుని చేరిపోయాను.

''ఏమండి మీ ఆడవాళ్ళు పైన ఎక్కి ఏం పడుకుంటారు నా మిడిల్ బెర్త్ తీసుకోండి'' ఉదారంగా ఆ అమ్మాయికి ఆఫర్ చేశాడు నడి వయస్కుడు.

కుతూహలంగా చూశాను.

'ధన్యవాదాలు. నేను పడుకోగలను' ముక్త సరిగా అని ఆ అమ్మాయి సునాయాసంగా పైకి ఎక్కి పక్క పర్చుకుంది.

ఇంతలోఆ అమ్మాయిని కిందనుంచి ఆ ప్రౌఢ పలకరించడంతో ఆ అమ్మాయి పేరు తెలిసింది. 'కావ్య' అని. చక్కని పేరు అనిపిం చింది.

వృత్తిపరంగా శబ్దమయ ప్రపంచంలో ఉన్న ఏకాంతం అంటే నాకిష్టం. అప్పుడే నాలోకి చూసుకోవటమూ, ఇతర్ల గురించి తాపీగా ఆలోచించటమూ వీలవుతాయి.. అలాంటి స మయం చిక్కినపుడు సాధారణంగా వొదులు కోను నేను.

ఉదయం మెలకువ వచ్చేసరికి నా సీట్లో కావ్య కూర్చుని ఉండడం చూశాను. ఆమె కిటికీలోంచి సూర్యోదయాన్ని చూస్తూ ఉం ది. పల్లటి గాలికి ఒంకీల జుట్టు చెంపలమీదకి జారి ఎగురుతోంది తీరాన్ని తాకి ఎగిసిపడే అలలా. అప్పుడప్పుడు సూర్యకాంతి పడి చెంప లు మెరుస్తున్నాయి. ఓ విధమైన ఉద్విగ్నత, పారవశ్యం ఆమె మొహంలో కన్పించింది. అ ట్లా కూచుని అలాంటి దృశ్యవీక్షణలో అపరిమి తమైన ఆనందం అనుభవిస్తుంటాను నేను. నాకిష్టమైన పనిచేస్తున్న ఆ అపరిచిత వ్యక్తి ఆ క్షణంలో నాకతి సన్నిహితురాలుగా అన్పించిం ది. సౌందర్యాస్వాదనలో ఉన్న మరో సౌందర్య మూర్తిని మనసులో ముద్రించుకుని డిస్టర్బ్ చేయటం ఇష్టంలేక కళ్ళు మూసుకుని పడుకు నవాణ్ణి మళ్ళీ నిద్రలోకి జారాను.

గట్టిగా మాటలు విన్పించడంతో మెలకువ వచ్చింది.

''ఈ సమయంలో ఈ పాడుపని చేస్తుంద ని తెలుసుకదా! నా చేతికెందుకిచ్చావు తెలిసి'' అని కేకలేస్తున్నాడు నడివయస్కుడు. కిందికి చూశాను. అతని ప్యాంటు అంతా ఖరాబైంది.

ఆ యువతి మౌనంగా చిన్న బుచ్చుకుని ఓ చేత్తో పాపని తీసుకుని ఓ గుడ్డతో అతని ప్యాం టుని తుడిచి రైలు కుదుపులకి తూలుతూ టాయిలెట్ వైపు వెళ్ళింది.

ఆ పెద్ద మనిషి ఇబ్బందిగా కదిలాడు.




అందర్నీ కలియజూశాడు. ముసలాయన భగవ ద్గీత చదువుకుంటున్నాడు. ఆ ప్రౌఢ దినపత్రి కను దీక్షగా చూస్తోంది. కావ్య మాత్రం ఓసారి చురుగ్గా అతని పక్క చూసి మొహం తిప్పుకోవ డం గమనించాను.

జాగ్రత్తగా కిందిగి దిగాను. నావైపుచూసి ''పిల్లలతో వస్తే ఇదే చిక్కు అలవాటయినవి అది వాళ్ళు చూసుకోవాలిగానీ మన చేతికిస్తే ఇంతే'' అన్నాడు. వాళ్ళ చీరలమీదపోతే మా త్రం ఫర్వాలేదా మహానుభావా అని మనసులో అనుకుని పైకి చిర్నవ్వి నా బ్యాగులోంచి బ్ర ష్షూ, పేస్టూ తీసుకుంటున్నాను.

ఆ పెద్దమనిషి లేచి టాయిలెట్ వేపు వెళ్ళడం చూసి కావ్య ఆ ప్రౌఢతో అంది ''చూడండి పిల్లల బాధ్యత ఇద్దరిదీ కాదా! పైగా అంతమందిలో నాకర్ని కేకలేసినట్లు ఎన్ని మాటలంటున్నాడో''!

ఆ ప్రౌఢ ఏదో చెప్పబోయేంతలో ఆ జంట వచ్చి కూచోటం చూసి కళ్ళెగరేసి మళ్ళీ పేప రు చదవడంలో మునిగిపోయింది.

అప్పటికి కావ్యలేచి పక్కకి జరగబోయిం ది.

''కూచోండి మరి కాసేపు'' అని వారించి టాయిలెట్స్ వేపు వెళ్ళాను.

నేను తిరిగి వచ్చేసరికి అంతా కోలాహలం గా అనిపించింది. స్టేషను వస్తున్నట్లుంది. అం దరూ సర్దుకుంటున్నారు. కావ్య కూడా బ్యాగు సర్దుకుంటూ ఉంది. నన్ను చూసి చిర్నవ్వు నవ్వింది. నేను సమాధానంగా నవ్వి బ్యాగు సర్దుకోవడంతో రైలు ఆగింది. మరోసారి ఆమె వంక దీర్ఘంగా చూసి దిగాను.

మధు, రాజూ స్టేషనుకు వచ్చారు. నన్ను గుర్తు పట్టి చేతులు ఊపారు. ప్లాట్ఫారం అం తా సందడి. అందరం స్టేషను బయటకు వచ్చేశాం.

స్టేషను బయట హోటల్లో కాఫీ తాగుతూ కొంతసేపు కబుర్లు తర్వాత రాజు వెళ్ళిపోయా డు మళ్ళీ కలుస్తానంటూ. మధు నేను ఇంటికి చేరాము స్కూటర్ మీద. అదే హడావిడి, అవే మాటలూ. మధు ఏమీ మారలేదు అనిపించిం ది.

కాలింగ్ బెల్ నొక్కగానే ఓ అమ్మాయి తలు పు తీసింది. 'హరిత మా ఆవిడ' అని పరిచ యం చేశాడు. పరస్పర పరిచయాలు అయ్యా క 'మీ గురించి అప్పుడప్పుడూ చెబుతుంటా రు' అని లోనికి వెళ్ళిపోయింది.

ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

స్నానాలూ టిఫిన్లూ కానిచ్చి మధు బాంక్‌కి వెళ్లిపోయాడు. బడలికగా ఉందని నేనూ నిద్రపోయాను మళ్లీ మధు వొచ్చి లేపేదాకా. హరిత మధ్యాహ్న భోజనం అమర్చి పిలిచింది. కబుర్లతో తినటం ముగియగానే ఓ అరగంట విశ్రాంతి తీసుకుని బయలుదేరాం: వాడి ఓ చిన్న పని ఉంటే దాన్ని పూర్తిచేసుకునేసరికి సాయంకాలమైంది. మూర్తిషాపుకెళ్లాం. నేనొస్తానని ముందుగానే తెలియటంతో వాళ్ల నాన్నగారిని కౌంటర్‌లో కూచోబెట్టి బయటకు వచ్చాడు. 'మళ్లీ వెళ్ళక్కర్లేదు కద' అన్నాడు మధు. లేదన్నట్లు తలవూపి ముందుకు నడిచాడు మూర్తి.

ముగ్గురం కొత్తగా ప్రారంభమైనట్లున్న చైనీస్ రెస్టారెంట్‌లోకి నడిచాం. కొంతసేపు కబుర్లు, కుశల ప్రశ్నలూ తరువాత మా స్నేహితులు ఎట్లా ఎక్కడెక్కడా స్థిరపడ్డారో మాట్లాడుతున్నాం.

మందమైన వెలుగూ, మంద్రసంగీతం, వెచ్చటి పానీయంతో అయస్కాంత కేంద్రం చుట్టూ అత్యున్నత ఇనుప ముక్కల్లా— మనుషులు టేబుళ్ల చుట్టూ మనిషిలోపలి లోపొరలు, వించుకుంటూ.

''ఎలా ఉంది నీ చెల్లాయి'' మధు ప్రశ్న.

నాకు నచ్చని ప్రశ్న.

నవ్వి ఊరుకున్నాను.

''నీకు నచ్చలేదు''!

ఇక ఊరుకోడని 'ఊ' అన్నాను.

''నువ్వు జర్నలిస్టువెట్లా అయ్యావో ఆశ్చర్యంగా ఉంది. పోనీ నీ మనసులో ప్రశ్నలు చెప్పవా! కామినీ, రమ్య, రతీ ఇందూ ఇలా అందరినీ ఒదిలి పల్లెటూరులో వెదికి విద్యాగంధంలేని ముగ్ధని ఎందుకు పెళ్లాడానా అని కదూ ''ఇక ఈ ప్రశ్నకి సమాధానం కొన్ని వందల సార్లు కొన్ని వందలమందికి చెప్పి ఉంటావు. మళ్లీ అడగడం దేనికీ అని''.

''ఇది నాకు చాలా ఇష్టమైన ప్రశ్న. సమాధానం చెప్పటం అంటే మరీనూ'' అని ఒక గుక్కతాగి మూర్తి వేపుచూపి ప్రారంభించాడు మధు.

''నాకు కావలసింది నన్ను ప్రేమించే మనిషి. కామినీ నా మేధస్సుని ప్రేమిస్తుంది. రతి నాలో రచయితని ఇష్టపడుతుంది. నన్ను ప్రేమించే మనిషికోసం వెతికీ వెతికీ అలసిపోయాను. నాకోసం జీవించే మనిషి, నేను తప్ప మరో ప్రపంచంలేని మనిషి కావాలి నాకు. అందుకే ఆ అమ్మాయిని పెళ్లాడాను. తన పేరు నిజానికి అనసూయ. కానీ నేను హరితగా మార్చాను. నీ చెల్లాయికి అందం మాత్రమే కాదు అణకువా, ఓరిమీ, నాపట్ల అచంచల విశ్వాసం ఉంది. సుఖజీవితానికి ఇవి అవసరం ఏమంటావు''.

ఎవరి సుఖజీవితానికి? అయినా వీడి దృష్టిలో ప్రేమంటే ఏమిటి? అని ఆలోచనలో పడ్డ నేను గ్లాసు ఖాళీ చేస్తూ కూచున్నాను.

మూర్తి నా భుజం తట్టి మధుతో.

''వాడేమంటాడూ నువ్వు మంచిపని చేశావు అనే అంటాడు. నీలాంటి వ్యక్తి భర్తగా దొరకడం ఆ అమ్మాయి అదృష్టం. అందుకామె నీకు జీవితాంతం కృతజ్ఞత చూపించాల్సి ఉంటుంది. ఇంత ఆదర్శమైన పనిచేసిన నీ విశాల హృదయాన్ని అభినందించక తప్పదు'' అన్నాడు మూర్తి.

ఆలోచనల్నించి పూర్తిగా తేరుకుని—

కామినీ థీసిస్ ఫైనల్ స్టేజ్‌లో ఉంది. రేపు కలుద్దాం హాస్టల్‌కెళ్లి అన్నాడు మధు.

''ఏమిటి గురూ ఏమైనా ఇంటరెస్ట్ ఉంటే చెప్పు నేను అడిగేస్తాను'' అన్నాడు మూర్తి కళ్ళు అరమోడ్చి.

''అబ్బే అలాంటిదేం లేదుకానీ— పైగా నేను రేపుదయం మా ఊరెళ్లాలి కూడాను. వీలైతే ఓసారి చూద్దామని అంతే'' అన్నాను చిరాకుని అదిమి పెడుతూ.

''ఇక వెళ్దామా'' అన్నాడు మధు వాచి చూసుకుంటూ. అప్పటికి పది గంటలయింది. మూర్తి బిల్లు చెల్లించాడు. కొద్దిగా తూలుతున్నట్లు నడుస్తుంటే ఇక లాభం లేదని రిక్షా ఆపించి అందులో కూచోబెట్టి సెలవు తీసుకున్నాం.

మధు స్కూటర్ స్టార్ట్ చేశాడు. చల్లటిగాలి వీస్తోంది. ఆకాశంలో అలల్లా మేఘాలు కదిలిపోతున్నాయి. సముద్ర గర్జనలా ఉండుండి ఉరుములు విన్పిస్తున్నాయి.

ఇల్లు చేరేసరికి తలుపులు తెరిచే ఉన్నాయి. అంతవరకూ పనిమనిషి తోడుగా ఉన్నట్టుంది. మేము లోనికి వెళ్లగానే ఆవిడ సెలవు పుచ్చుకుని వెళ్లింది. టీవీలో ఏదో ప్రోగ్రాం వస్తోంది. హరిత లేచి ''అన్నం వడ్డించమంటారా'' అనడిగింది. భర్తకనుసైగతోనే వంటింట్లోకి వెళ్లిపోయింది.

బట్టలు మార్చుకుని భోంచేశాం. ఉదయాన్నే ఆరుకల్లా బస్సుందని చెప్పాను. ''హరిత ఇద్దర్నీ అయిదు గంటలకే లేపుతుందిలే బెంగపెట్టుకోకు'' అని నవ్వాడు మధు.

భోజనం కాగానే గదిలోకి వచ్చి పడుకున్నానే గాని నిద్రపట్టే సూచనలు కన్పించలేదు. వాన ఎక్కువైంది బయట. కిటికీ తలుపు కొట్టుకుంటుంటే మూసి వేశాను. హరితని పెళ్లాడటానికి మధు చెప్పిన కారణాలే నన్ను కలవరపెడుతున్నాయి. సినిమాల్లో ప్రతిబింబిస్తున్న మగవాడి నైజం గురించి కావ్య విశ్లేషణ గుర్తొచ్చింది. తనకాళ్ల వద్ద త్యాగం పేరుతోనో, మరో సెంటిమెంట్‌తోనో, కృతజ్ఞతతోనో స్త్రీ పడి ఉండాలన్న ఆలోచనాకారణే మధులోనూ నాకు కనిపించసాగింది. ఎందుకో హఠాత్తుగా కావ్య గుర్తొచ్చింది. హరితనే ఏరికోరి పెళ్లాడటంలో మధుకున్న కారణాలు క్రమంగా అర్థం అవుతూ వచ్చాయి. అశాంతి స్థానంలోనే నిర్లిప్తత చోటు చేసుకుంది నాలో. మధు కూడా మగవాడే కదా అనుకున్నాను.

ఉదయాన్నే ఊరెళ్లాలి. నిద్రకి ప్రయత్నిస్తున్న నాకు మళ్లీ మళ్లీ కావ్య గుర్తుకు వస్తోంది. నేను చిరునవ్వు నవ్వినప్పుడు ఆమె కళ్లలో మెరుపు మొహమంతా పరచుకున్న స్నిగ్ధరూపం మనసులో మెదిలింది. ○

